# నాకు నచ్చిన నా కథ



శారదా అశోకవర్ధన్

నేను కథలు కానీ, కవితలు కానీ, చివరకి పాటలు కూడా కాలక్షేపం కోసమో, లేకపోతే ఏదో ఒకటి రాసి తీరాలనే తపనతోనో రాయలేదు. ప్రతి కథ వెనకా ఒక ప్రేరణ, ఒక సంఘటనా వుంటేనే తప్ప నా కలం కదలదు. నే చెప్పదలచుకున్న విషయం, నలుగురి దృష్టిలోకీ పడాలీ, అందరినీ ఆలోచింప జెయ్యాలీ అన్నదే నా లక్ష్యం. 'పుస్తకాలు చదివీ, సినిమాలు చూసీ మనుషులు మారుతారా?' అన్న కోవకు నేను చెందను. నూటికి ఒక్కరు మారినా సరే, జన్మ ధన్యమైనట్లే!

స్కూల్లో చదివే రోజుల్నించే అడపాతడపా రచనా వ్యాసంగం చేసే దాన్ని! ఉద్యోగరీత్యా సమాచార శాఖలోనూ, ఆకాశవాణిలోనూ పదిమందితో పరిచయభాగ్యం లభించింది. తద్వారా నాకు తెలీకుండానే మనుషుల్ని పరిశీలించడం జరుగుతూ వచ్చింది. భిన్న భిన్న మనస్తత్వాలు కల వ్యక్తులు, విచిత్ర స్వభావాలు గల వ్యక్తులతో పరిచయం కలిగే అవకాశం దొరికింది. ఒక్కొక్కసారి కొందరిని చూస్తే, జాలి, కొన్ని సందర్భాలలో కోపమూ వొస్తుంది కూడా! ఆడంబరాలకుపోయి, ఆత్మవంచన చేసుకుంటూ, ఎదుటివారిని కించపరుస్తూ, తమ గొప్పలు చాటుకుంటూ మాట్లాడడం కొందరికి సరదా.

ముఖ్యంగా ఈ లక్షణం ఆడవాళ్లలో మరీ కనిపిస్తుంది. ఇటువంటి వారిని చూస్తూవుంటే వాళ్ల అజ్ఞానానికి జాలీ, వారి ఆడంబరాలమీద కోపం, అన్నింటినీ మించి వారి ఆత్మవంచనకి బాధా కలిగి, ఏదో ఒక రూపంలో అటువంటివారి కళ్ళు తెరిపించాలనే తపన నాలో రగులుతూండేది. అదే ఈ కథద్వారా నే చెప్ప దలుచుకున్నది. అది విజయవంతంగా చేశాననే అనుకుంటున్నాను. ఈ కథ రచనాకాలం 1975 ఆంధ్రప్రభలో! ఇలాటి సంఘటనలు స్వయంగా చూసి, రచించిన రచన ఇది!

## ఆఫీసరు భార్య!

నెలలు నిండిన గర్భవతిలా నిండుగా వుంది కృష్ణా ఎక్స్‌ప్రెస్. ప్రయాణీకుల తోపిళ్లా రాపిళ్లా ఒకపక్క ఉండగా, 'చాయ్... కాఫీల నినాదాలూ, ఇడ్లీ... వడా... సాంబార్ రైస్, పూరీ' అరుపులు, వచ్చిపోయే ఇతర రైళ్ల కూతలూ కూలీల గడబిడా, పళ్లూ, బొమ్మలూ, పుస్తకాలూ వగైరా అమ్మే బళ్లూ, ఎవరు ఎవరితో ఏం మాట్లాడుతున్నారో అర్థంకాని, పిచ్చాసుపత్రి సీనులా ఉంది సికింద్రాబాదు స్టేషను.

నా బోగీ నెంబరూ, సీటు నెంబరూ వెతుక్కుంటూ ఎలాగో లోపలి కెక్కాను. ఆక్కడ నా సీటులో ఒక లావుపాటావిడ హాయిగా కాళ్ళు జాపుకు కూర్చుని బత్తాయిపండు ఒలుచుకు తింటోంది.


"క్షమించండి! ఇది నా సీటు" అన్నాను ఎంతో వినయంగా.

నావేపు చురచురా చూసింది కొరికేసేలా ఆమె. ఆ తీక్షణ వీక్షణాలకు గుండె దడదడలాడింది ఒక్క క్షణం.

"ఇది నా సీటే" అంది ధీమాగా, బత్తాయి తొన నోట్లో పెట్టుకుంటూ.

"కాదు. మీరు పొరపాటు పడుతున్నారు. కావాలంటే మీ టిక్కట్టు చూసుకోండి" అన్నాను నెమ్మదిగా.

"ఇదిగో అమ్మాయ్! పొరపాటూ గిరపాటూ ఏం లేదు. నాకు వారంటుంది. మా ఆయన పెద్ద ఆఫీసరు. ఆయన అలాంటి తప్పులేమీ చేయరు. చూడబోతే నువ్వే పొరపాటున ఈ డబ్బాలో ఎక్కినట్టున్నావ్! ఇది ఫస్టుక్లాసు డబ్బా తెలుసా? నీ వాలకం చూస్తే అలాగే వుంది" గుక్క తిప్పుకోకుండా దండకం చదివేసింది, మెడ తిరగకుండా అడ్డుకుంటున్న (బహుశా గుచ్చు




కుంటున్నాయేమో!) చంద్రహారాన్నీ, పలకసర్లనీ మెడకి బిగువుగా వున్న నల్ల పూసల్నీ సర్దుకుంటూ.

ఆవిడ మాటలకి షాక్ కొట్టింది నాకు. 'ఆఫీసరు భార్యనని ఏం టెక్కు చూపెడుతూంది? భర్త ఏమాఫీసరోగానీ, ఈమె మాత్రం ఆఫీసరు బాబులా మాట్లాడుతోంది! ఎందుకో ఆమెను చూస్తూన్నకొద్దీ నవ్వొచ్చింది! నా సీటు లోంచి లేవకుండా అలా దర్జాగా కూర్చుని దబాయిస్తున్నందుకు ఒళ్ళు మండు కొచ్చింది కూడా. కానీ, ఆవిడతో ఎలా మాట్లాడాలో తెలీక తికమకపడుతూన్న నాకు, "వారంటేమిటండీ... మీరు..." అని ఎవరో ప్రశ్నించడంతో, ఆవిడ అటుతిరిగి, "హయ్యో నా మతిమండా! మా అబ్బాయి మిలిటరీ ఆఫీసరు లెండి. వాడు వారంటుమీద వొస్తాడు కదూ! అది వినీ వినీ నోటంట అదే వచ్చేసింది. మాది 'ప్యాసు' అంది నవ్వుతూ. ఇంతలో ఈ గొడవంతా విని, కండక్టర్ అటుకేసి వొచ్చాడు. నా టిక్కట్టునీ ఆవిడగారి ప్యాసునీ మార్చి మార్చి చూసి, ఆవిడది పక్కసీటని తేల్చేశాడు. చేసేదిలేక 'విధి ధర్మమా' అంటూ ఆవిడ పక్క సీట్లోకి మారింది నావేపు కొరకొరా చూస్తూ.

"హమ్మయ్య" అనుకుని నా సీట్లో కూర్చున్నాను. వెంటనే రైలు కూత వేసింది. గార్డు పచ్చ జెండా ఊపాడు. "బై... బై..." అంటూ చెయ్యూపాడు ప్రసాద్. 'బై' అంటూ నా చిన్న సూటుకేసుని పక్కగా పెట్టుకుంటూ చెయ్యూపాను. మరచెంబూ, ఫ్లాస్కూ, పళ్ళువున్న బుట్టని కాళ్ల దగ్గరగా

పెట్టుకుని, కుడిచేతి వైపొక సూటుకేసూ, అటకమీద రెండు పెట్టెలూ సర్ది, కాళ్ళు జాపుకుని కూర్చుందావిడ, రైలు ఆమె స్వంతమైనట్టు. రైలు వేగం హెచ్చింది. నేను బ్రీఫుకేసులోంచి 'వీక్లీ' తీసి చదువుకుంటున్నాను. ఎవరికి వారు పేపరో పుస్తకమో తీసి చదువుకుంటూ కూర్చున్నారు. ఉన్నట్టుండి "ఇందాక స్టేషనుకొచ్చినాయన, నీ కేమవుతారూ?" అంది ఆవిడ. ఆ ప్రశ్నకి పుస్తకంలోంచి తలెత్తి చూశాను. సందేహం లేదు. ఆవిడ ఆ పశ్న నన్నే అడుగుతూంది. ఆవిడ చూపులన్నీ నా టోపీ మెడమీదే వున్నాయ్. "మా అన్నయ్య" అన్నాను ముక్తసరిగా, మళ్లా పుస్తకంలోకి మెడదూర్చి.

"ఏమిటో! ఈ రోజుల్లో ఎవరు ఎవరో తెలీడంలేదు" అంది ఆవిడ పెదవి విరుస్తూ.

ఆవిడ మాటలకి నాకు ఒళ్ళు మండిపోయింది. ఈడ్చిపుచ్చుకు తన్నాలని పించింది. కానీ, ఏమీ చెయ్యలేక నోరుమూసుకు కూర్చున్నాను. రెండు లైన్లు చదివానో లేదో, మళ్లీ ప్రశ్న. "నీకింకా పెళ్లి కాలేదా?" అని

"లేదు" ఈసారి తలెత్తి ఆమెకేసి చూడకుండానే సమాధానం చెప్పాను.

"ఎలా అవుతుందిలే! ఆడపిల్ల పెళ్లంటే మాటలా? బోలెడంత కట్నం కుమ్మరిస్తేగానీ ఆడపిల్ల ఇల్లు కదలదు. సామాన్య జీతగాడికి శిక్ష. ఇద్దరు ఆడ పిల్లలు పుడితే చాలు, నడుం వంగిపోవలసిందే, జుట్టు నెరిసిపోవలసిందే," మళ్లీ దండకం మొదలుపెట్టిందావిడ, ఎవరు విన్నా, వినకపోయినా. ఆవిడ ధోరణి మహా చికాకు పుట్టించింది నాకు. అక్కణ్ణుంచి లేచిపోవాలనిపించింది. కానీ, ఎక్కడ కూర్చోవాలి? అన్ని సీట్లూ నిండిపోయాయి. చచ్చినట్టు తలవంచుకుని పుస్తకం అడ్డుపెట్టుకున్నాను! ఆమెను చూడ్డం ఇష్టంలేక.

ఇంతలో 'పల్లీ...పల్లీ...పల్లీ బఠాణీ...' అంటూ ఒక కుర్రాడు లోపలి కొచ్చాడు.


"ఏయ్...పల్లీ...ఇలారా" పిలిచింది ఆమె. "ఎలా ఇస్తున్నావ్" అంది.

"పదిపైసలు గొట్టం" చిన్న గొట్టాన్ని చూపించాడు వాడు.

"ఇది పదిపైసలా? అయిదుపైసల కివ్వు." అంది.

"పడదు" అంటూ తిరిగి వెళ్లబోయాడు వాడు.

"సరే ఇవ్వు, ఏం చేస్తాం? అందుకే మామూలు జీతగాళ్ళు బతకలేక చస్తున్నారు, ఎవరో ఆఫీసర్లుతప్ప. వేలంత లేదు గొట్టం పల్లీలు పదిపైసలయితే తులం బంగారం ఖరీదు వేరే చెప్పాలా? అందుకే ఈ రోజుల్లో అందరూ




ఫాషనంటూ ప్లాస్టిక్ దుద్దులూ, ప్లాస్టిక్ గాజులూ తగిలించుకుంటున్నారు. బోసి మెడ మరీ ఫాషనూ..." ఇంత ఉపన్యాసమూ ఇచ్చి వాడి చేతిలో పదిపైసలు పెట్టింది. అందరూ ఆమెకేసి చూసి నవ్వుతున్నారు. అందరూ ఆమె మాటలు వింటున్నారని గ్రహించిన ఆమె మురిసిపోతూంది. గర్వం ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కనబడింది. అసహ్యంవేసి నేను తల కిటికీవైపు తిప్పుకున్నాను. కానీ ఏం లాభం?

"అమ్మాయ్ ఇవిగో తీసుకో" అంటూ కొన్ని పల్లీలు చేతిలో పుచ్చుకుని నన్ను పిలవడం మొదలెట్టింది.

నన్ను కాదన్నట్టు నేను తిరిగిచూడలేదు.

"ఏయ్ నిన్నే... నీ పేరేమిటి?" ఈసారి మరీ బిగ్గరగా అంది.

ఇంక లాభం లేదనుకుని చెప్పాను—"లావణ్య" అని.

"ఏమిటో! 'లావణ్య'– 'నాజూకు'– 'సుకుమారి' నా బొంద! లక్షణంగా లక్ష్మి, సరస్వతీ, పార్వతీ, ఇలా దేవతల పేర్లు మానుకుని, ఫాషను ఫాషనంటూ చచ్చుపేర్లు పెట్టుకుంటున్నారు. దేముళ్ళ పేర్లు పెట్టుకోవడం నామోషీ అయిపోయింది. ఆ లక్ష్మిదేవి కటాక్షం లేనిదే పూట గడవదు. సరస్వతీ ప్రసన్నం కానిదే బతకలేరు. కానీ నోరారా పిలుచుకోడానికీ, తలుచుకోడానికీ లేకుండా కొత్త కొత్తగా ఈ వెధవ పేర్లు" మళ్ళీ వల్లించింది దండకం.

ఈసారి నాకు నిజంగా ఏడుపొచ్చేసింది, నా పేరుమీద ఈవిడ చేసిన వ్యాఖ్యానం వింటూవుంటే. అసలు పొద్దున్నే ఈవిడ పక్కన కూర్చున్నందుకు

నామీద నాకే జాలేసింది. కండక్టరుకి చెప్పి నా సీటు మార్పించుకోవాలన్నంత కోపం వొచ్చింది. కానీ ఏమీ చెయ్యలేక సభ్యత ముసుగులో నోరు మూసుకుని కూర్చున్నాను. మరికొన్ని గంటలు ఎలా గడుస్తాయా భగవంతుడా అనుకుంటూ.

"మీ రెంతమంది అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములూ?" మరో ప్రశ్న.

"ఇద్దరు చెల్లెళ్ళు, ఒక అన్నయ్యా" విసుగ్గాచెప్పాను. కోర్టులో లాయరు లాగా తను ప్రశ్నలడగడం, బోనులోని ముద్దాయిలా తను సమాధానం చెప్పడం. కళ్లనీళ్ల పర్యంతం అయింది నాకు

"హూ(....! ఆడ సంతానమే ఎక్కువన్నమాట! పాపం మావారి ఆఫీసులో ఒక గుమస్తా వున్నాడు. అతనికి అయిదుగురు ఆడపిల్లలు. ఎవరో చెయ్యి చూసి ఆరో సంతానం మగపిల్లాడు పుడతాడని చెప్పారట. అందుకని మళ్ళీ ప్రయత్నించేశారు. మళ్ళీ ఆడపిల్లే పుట్టింది. ఆరుగురు ఆడపిల్లలకి తండ్రయి కూర్చున్నాడు! ఇప్పుడు లబోదిబోమని మొత్తుకుంటాడు. ఏం లాభం? ఆరుగురికీ పెళ్ళిళ్ళుచేసి పంపాలంటే మాటలా?" పకపకానవ్వింది అదేదో పెద్దజోక్‌లాగా. ఆ గుమస్తా గురించి అంత హేళనగా. అతని బలహీనతని గురించి అంత తేలిగ్గా ఆమె మాట్లాడుతూవుంటే. నాకు ఒళ్లుమండింది. ఈసారి పుస్తకాన్ని పూర్తిగా మొహానికి అడ్డంగా పెట్టుకున్నాను, చదువుతూన్నట్టుగా నటిస్తూ.

"మా వారికి ఆడపిల్లలంటే ఎంతో ముద్దు. మా సునీల్ కడుపులో వున్నప్పుడు, ఆడపిల్ల పుడుతుందేమోననీ, మావారు గొలుసూ, గాజులూ, ఉంగరాలూ మొదటే చేయించి పెట్టేశారు. తీరాచూస్తే మగపిల్లాడు పుట్టాడు. అవన్నీ ఆ సన్నాసికే వేశాం ముచ్చటపడుతూ."

నేను ఆవిడకేసి చూడకపోయినా, ఆమె నాకు వినపడేలా పెద్దగా మాట్లాడ్డం నాకు మరీ బాధనిపించింది. అయినా పుస్తకాన్నిమాత్రం అడ్డు తియ్యకుండా అలాగే కూర్చున్నాను. టైము పన్నెండయింది. విజయవాడ చేరడానికీ మరో అరగంట పడుతుంది. ఈలోగా ఈమె ఎన్ని ప్రశ్నలు వేస్తుందో తలచుకుంటే-గుండె దడదడలాడింది.

ఒక అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి! ఆ నిశ్శబ్దానికి కారణం తెలీక, మెల్లిగా పుస్తకాన్ని కిందికి దించి చూశాను. ఆమె బాత్‌రూం లోంచి బయటికొస్తూ, నాకేసి చూసి నవ్వింది. హడలిపోయాను. ఎందుకు చూశానా అని బాధపడుతూ.

"నీకోసం స్టేషనుకి ఎవరైనా వస్తారా, నువ్వే పోతావా?

"వస్తారులెండి". తలవంచుకునే సమాధానం ఇచ్చాను.

"లేకపోతే చెప్పు. మా బంట్రోతు ఎలాగా వస్తాడు స్టేషనుకి. నీకూ ఒక ఆటోనో, టాక్సీనో తెచ్చిపెడతాడు. మా వారికి టైముండదు రావడానికి. పైగా ఈ గుమాస్తాగాళ్ళు సరిగ్గా పనిచేసి చావరుట! బాధ్యతంతా ఆఫీసరుదేనట. ఆఫీసరుగిరీకంటే గుమాస్తాగిరీ వెయ్యిరెట్లు నయమే అంటూవుంటా రాయన!"

ఆవిడగారి మాటలన్నీ విన్నాక, ఆవిడగారి భర్తగారు ఏ ఆఫీసరో తెలుసుకోవాలన్న కుతూహలం నాలో మొదటిసారిగా కలిగింది.

"మీ ఆయన ఏం ఆఫీసరు?" నాకు నేనుగా మాట్లాడిన మొదటిమాట అది.

"రైల్వే కంట్రోలింగ్ ఆఫీసరు! అవును, మరిచిపోయా అడగడం, మీ నాన్నగారికేం పని?" వక్కపొడి నోట్లో వేసుకుంటూ అడిగింది.

"నాన్నగారు హైకోర్టులో జడ్జి! అన్నయ్య నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఇంజనీరు! ఒక చెల్లి డాక్టరు! ఇంకో చెల్లి ఎల్.ఎల్.బి. చదువుతోంది. నేను మొన్ననే ఐ.ఎ.ఎస్ పాసయ్యాను. విజయవాడలో కలెక్టరుగా ఉంటున్నాను." అన్నాను గుక్కతిప్పుకోకుండా, మళ్ళీ ఆవిడ మరో ప్రశ్న వెయ్యకుండా!

"ఏమిటీ? మీ నాన్నగారు జడ్జీయా? అన్నయ్య ఇంజనీరా? ఒక చెల్లెలు డాక్టరు, ఒక చెల్లెలు లాయరూనా? నువ్వు కలెక్టరువా?" ఆశ్చర్యంతో నోరు తెరిచింది.

అంతే! షాక్‌కొట్టినదానిలా తెరచిన నోరు ఎంతసేపటికీ మాతపడలేదు. విజయవాడ వొచ్చేసింది! నా స్టాఫంతా నాకోసం రావడంతో నేను గబగబా ట్రెయిను దిగిపోయాను. కానీ పాపం, ఆ ఆఫీసరుగారి భార్య మాత్రం, ఇంకా షాక్‌నుంచి తేరుకున్నట్టు లేదు, నాకేసి నోరు తెరుచుకుని చూస్తూ అలాగే కూర్చుండిపోయింది, మతిపోయినదానిలా!

